సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 22 ၊ మే ၊ 2024



సోమశిలలో 7.665 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారానికి 7.665 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.76,590
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,841
3 శాతం జీఎస్టీతో	రూ.7,046
సవర (8 గ్రాములు)	రూ.56,368



మొబైల్ ఫోన్ల రికవరీ
జిల్లాలో వివిధ రకాలుగా పొగొట్టుకున్న 600 మొబైల్ ఫోన్లను మొబైల్ హంట్ విధానంలో పోలీసులు రికవరీ చేశారు. వీటి విలువ రూ.1.50 కోట్లు ఉంటుంది. 8లో

న్యూస్‌రీల్

నెల్లూరు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. ఆయనకు నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కలెక్టర్ ఎం.హరినారాయయన్, వీఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ సుందరవల్లి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, జేసీ సేతు మాధవన్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. బుధవారం వీఎస్‌యూలో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు గవర్నర్ నెల్లూరుకు విచ్చేశారు.

నేడు వీఎస్‌యూకు గవర్నర్ రాక

వెంకటాచలం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ బుధవారం వీఎస్‌యూకు రానున్నారు. ఉదయం 11.30 నుంచి 12.55 గంటల వరకు జరగనున్న వీఎస్‌యూ 8వ, 9వ స్నాతకోత్సవాల వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. స్నాతకోత్సవాలను అట్టహాసంగా నిర్వహించేందుకు వీఎస్‌యూ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు గవర్నర్ హాజరుకానుండడంతో వీఎస్‌యూలో పటిష్ట పోలీస్ బందోబస్తుతో పాటు, ఇతర ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీఓ హేమలత

సంగం: సంగం బాలికల గురుకుల పాఠశాలలో డీసీఓ హేమలత మంగళవారం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న 200 సీట్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. జిల్లా నలుమూల ల నుంచి విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి భారీగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రిన్సిపల్ సుమతి అన్ని వసతులు కల్పించారు.

'ఈటీపీబీఎస్' ద్వారా సర్వీసు ఓట్లకు అవకాశం

నెల్లూరు (బారకాసు): సార్వత్రిక ఎన్నికల్లో సుదూర ప్రాంతాల్లో ఉంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ప్రధానంగా ఆర్మీలో పనిచేస్తున్న వారికి ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ (ఈటీపీబీఎస్) ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో స్థానిక ఎన్నికల సంబంధిత ఉద్యోగులకు సర్వీస్ ఓట్లను అధికారులు కేటాయించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో సర్వీస్ ఓట్లు మొత్తం 47 వరకు ఉన్నాయి. ఆయా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు 13 మంది మాత్రమే తమ సర్వీస్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం ఇద్దరు ఆర్మీ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిని స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో భద్రపరుస్తున్నారు. ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు ఈ సర్వీస్ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని, సర్వీస్ ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు తమ ఓటు హక్కును ఈలోపు ఎప్పుడైనా వేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి/కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు.

గుడ్లుపెట్టి వెళుతున్న తాబేలు



జీవ వైవిధ్య తామేలు

మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం మూలంగా సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. పర్యావరణానికి దోహదపడే జీవరాసులు రోజురోజుకు అంతరించిపోతున్నాయి. ఆహ్లాదకరమైన ప్రకృతి, చల్లటి గాలులతో పరవశించే తీర ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అలాంటి తాబేళ్ల పునరుత్పత్తి, సంరక్షణ బాధ్యతను అటవీశాఖ వన్యప్రాణి విభాగం అధికారులు తీసుకుంటున్నారు.

సముద్ర పర్యావరణ పరిరక్షణలో తాబేళ్ల కీలకపాత్ర

- పదేళ్లుగా తాబేళ్ల పిల్లలను వదులుతున్న అటవీశాఖ
- ఈ ఏడాది 40,500 తాబేళ్లు వదిలిపెట్టిన అధికారులు
- తీరం వెంబడి 10 తాబేళ్ల పిల్లల హేచరీలు



తాబేలు పెట్టిన గుడ్లు

కోవూరు: జీవ వైవిధ్యంలో తా'మేలు' పాత్ర అనిర్వచనీయం. పర్యావరణ పరిరక్షణను కాపాడడంతో పాటు సముద్ర జలాలను శుద్ధి చేయడంతో తాబేళ్లు బహుముఖ పాత్రలు పోషిస్తున్నాయి. 'ఆలివ్‌రిడ్లీ' తాబేళ్లు సముద్ర జలాల్లోని పాచి, మొక్కలు, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తింటూ సముద్ర జలాలు కలుషితం కాకుండా చేస్తాయి. సముద్ర జలరాసులను అంతరించి పోకుండా కాపాడుతాయి. సముద్రంలో ఆక్సిజన్ స్థాయిలు పెంచేందుకు తాబేళ్లు ఎంతగానో దోహదపడుతాయి. అడ్డదిడ్డంగా పెరిగే సీ గ్రాస్‌ను తాబేళ్ల తినడం వల్ల సీ గ్రాస్ బెడ్ ఏర్పడుతుంది. దీంతో సముద్రంలో ఉన్న జీవ రాశులు ఆ బెడ్‌పై గుడ్లను పెట్టి సంతానోత్పత్తిని పెంచి సముద్ర జలాలను శుద్ధి చేయడంతో పాటు మత్స్య సంపద వృద్ధికి తోడ్పడుతాయి. ఈ ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు డైనోసార్స్ కన్నా అతి ప్రాచీనమైనవని. ఇవి మానవుడు పుట్టక మునుపు నుంచే భూమిపై ఉన్నాయని చెబుతున్నారు.

సముద్రం కోతకు గురికాకుండా..

తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో ఒక రకమైన జెల్ విడుదల చేస్తాయి. ఆ జెల్ భూమిలో బంకలా అతుక్కుపోయి తీర ప్రాంతం కోతకు గురి కాకుండా నివారిస్తోంది. ఏడాదికి ఒక్కో తాబేలు 3 నుంచి 5 కిలోల జెల్ విడుదల చేస్తోంది. తాబేలు శ్వాస తక్కువగా తీసుకోవడం వల్ల ఆలివ్‌రిడ్లీ రకం తాబేళ్లు 300 నుంచి 400 ఏళ్ల వరకు జీవించగలుగుతాయి. సముద్ర జలాలను శుద్ధి కావడంతో తీర ప్రాంతంలో నివశించే ప్రజలకు సముద్రపు గాలి సోకడం వల్ల అంటువ్యాధులు రాకుండా కాపాడుతాయని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతారు.

జిల్లా తీరంలో 10 హేచరీలు

జిల్లా సముద్ర తీరం వెంబడి 10 ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. వన్యప్రాణి విభాగం తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. 2012 నుంచి జిల్లాలో 11 గ్రామాల వద్ద సముద్రతీరంలో ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు అటవీశాఖ శ్రీకారం చుట్టింది. గడిచిన పదేళ్లలో 1.95 లక్షల గుడ్లను సేకరించి అందులో నుంచి తాబేళ్ల పిల్లలను ఉత్పత్తి చేసి సముద్రంలోకి వదిలి పెట్టినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 10 హేచరీల ద్వారా తీరంలో తాబేళ్ల పెంపకం చేపడుతున్నామన్నారు.



ఆలివ్‌రిడ్లీ తాబేలు పిల్లలు



కట్టుదిట్టం చేసిన తాబేలు పిల్లల హేచరీ

తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న దృశ్యం (ఫైల్)



ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల ప్రయాణం.. అద్భుతం

ఆలివ్‌రిడ్లీ తాబేలు ఎక్కడ అయితే జన్మిస్తోందో, అక్కడ నుంచి వేల కిలో మీటర్లు ప్రయాణం చేస్తోంది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, అరేబియా మహా సముద్రం, హిందూ మహా సముద్రం, బంగాళాఖాతం మీదుగా ప్రయాణం చేసి ఈ తాబేలుకు 15 ఏళ్ల వయస్సు వచ్చేంత వరకు ప్రయాణం సాగిస్తోంది. అక్కడ నుంచి వేల కిలో మీటర్లు దాటి ఎక్కడ పుట్టిందో అక్కడికే చేరుకుంటుంది. అక్కడ గుడ్లు ఉత్పత్తి చేసి ప్రయాణం మొదలుపెడుతోంది. ఏడాది తర్వాత ఇదే సీజన్‌లో జిల్లాలోని తీర ప్రాంతానికి వచ్చి మళ్లీ తన ఉత్పత్తిని ప్రారంభిస్తోంది. వీటిలో ఒక రకం జీవిత కాలం 60 నుంచి 300 ఏళ్లు, మరో రకం 60 నుంచి 400 ఏళ్ల వరకు జీవించగలగుతోంది. ఇది పుట్టుకతోనే మంచి తెలివితేటలతో జన్మిస్తోంది. ఏ జీవి అయినా పుట్టినప్పుడు నీళ్లను చూసి భయపడుతోంది. కానీ ఈ తాబేలు పుట్టిన కొన్ని గంటల్లోనే సముద్రానికి ఎదురెళ్లుతోంది. ఇవి మత్స్యకారులకు కల్పతరువుగా చెప్పవచ్చు.

తాబేళ్ల పెంపకం ఎలా

అలసట లేని ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు కేవలం సంతానోత్పత్తి కోసమే వేల కి.మీ. ప్రయాణించి సముద్ర తీరానికి చేరుకుని ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సహజ సిద్ధంగానే గుడ్లు పెడుతాయి. ఈ గుడ్లను అటవీశాఖ వారు నక్కలు, అడవి పందుల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకుని పునరుత్పత్తి కేంద్రాలకు తరలిస్తారు. ప్రస్తుతం 6 వేల గుడ్లను సురక్షితమైన హేచరీలకు తరలించినట్లు తెలుస్తోంది. తాబేళ్ల పునరుత్పత్తికి ఏ ప్రాంతం అనుకూలంగా ఉంటుందో అటవీశాఖ వన్యప్రాణి విభాగం అధికారులు ముందుగా గుర్తిస్తారు. ఆ ప్రాంతంలో మినీ హేచరీలు ఏర్పాటు చేసి అందులో 2 నుంచి 3 అడుగుల సైజు గుంతలు తవ్వి గుడ్లను పొదిగిస్తారు. గుంతల్లో పొదిగిన గుడ్డు నుంచి పిల్లలు బయటకు రావాలంటే 45 రోజుల నుంచి 60 రోజుల వరకు సమయం పడుతుంది. డిసెంబర్ నుంచి జూన్ వరకు ఉత్పత్తి కేంద్రాల ద్వారా తాబేళ్లను అభివృద్ధి చేస్తారు. అందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నాయి.

తాబేళ్లను వేటాడి చంపినా, వాటిని తిన్నా నేరమే

తాబేళ్లను వేటాడి చంపినా, వాటి గుడ్లను తిన్నా వన్యప్రాణి పరిరక్షణ చట్టం 1972 కింద నేరంగా పరిగణిస్తారు. 3 నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు. భారత ప్రభుత్వం ఈ తాబేళ్ల భద్రతను చట్టం పరిధిలో షెడ్యూల్-1లో చేర్చింది.

మానవ మనుగడకు పర్యావరణమే కీలకం



మానవ మనుగడకు పర్యావరణమే అత్యంత కీలకమని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మత్స్యకారులు వేటకు వెళ్లే క్రమంలో వారిబోట్లకు ఉన్న చక్రాలు తగిలి కొన్ని తాబేళ్లకు ప్రమాదం వాటిల్లుతోంది. వాటిని జాగ్రత్తగా గమనించి సంరక్షించాల్సిన బాధ్యతను మత్స్యకారులు తీసుకుంటే మంచింది. మత్స్యకారులకు సంపద అధికంగా లభించాలంటే తాబేళ్ల సంరక్షణ ఎంతో ముఖ్యం. ప్రతి ఏటా పిల్లలను ఉత్పత్తి చేసి సముద్రంలో వదిలి పెడుతున్నాం. ఈ ఏడాది కూడా 40,500 తాబేళ్ల పిల్లలను వదిలిపెట్టాము.

– ఏ చంద్రశేఖర్, జిల్లా అటవీశాఖాధికారి, నెల్లూరు

ఆలివ్‌రిడ్లీ తాబేలు ప్రత్యేకత

ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు సుమారు 45 కిలోల బరువు, మూడు అడుగుల పొడవు ఒకటిన్నర అడుగుల వెడల్పు ఉంటుంది. పుట్టిన పిల్ల మూడు సెం.మీ. పొడవు, అర అంగులం వెడల్పు ఉంటుంది. ఆడ తాబేలు ఒడ్డుకు వచ్చి 60 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంది. మగ తాబేలు 25–30 డిగ్రీల ఉష్ణోగ్రత, ఆడ తాబేలు 30–32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటేనే బయటకు వస్తాయి. ఆడ తాబేళ్ల పిల్లలు సముద్రంలోకి ఏ తీరం నుంచి వెళుతుందో అది పెద్దదై గుడ్లు పెట్టే సమయానికి అదే తీరానికి వచ్చి గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకమని అధికారులు చెబుతున్నారు. అవి గుడ్డు పెట్టే ప్రదేశాన్ని గుర్తించి ఆ ప్రదేశాల్లో ఎవరు సంచరించకుండా కర్రలు నాటి రక్షణ కల్పించడం ద్వారా మనం వాటిని పరి రక్షించవచ్చు. అయితే గత కొంత కాలంగా సముద్రంలో పెద్ద పెద్ద బోట్లు తిరగడం వల్ల వాటి తాకిడికి తాబేళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడి ఒడ్డుకు చేరుతున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మరో వైపు తీరంలో ఎక్కువగా పరిశ్రమలు ఏర్పడి తద్వారా విడుదలయ్యే వ్యర్థ జలాలు సముద్రంలోకి విడిచి పెట్టడంతో కొంత భాగం తాబేళ్లు నశించిపోతున్నాయి.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి
- ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్
- జిల్లా రెవెన్యూ అధికారి లవన్న



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ లవన్న

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో టెన్త్, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి లవన్న ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీసీ హాల్‌లో టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ లవన్న మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 39 పరీక్ష కేంద్రాల్లో 7,083 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 51 పరీక్ష కేంద్రాల్లో 20,298 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు, 5,592 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 25,890 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి నిర్ణీ త సమయం కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రత

ఈ రెండు పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లను చేయాలని, పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ఇతర వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యారోగ్యశాఖ ద్వారా పరీక్ష కేంద్రా ల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఓఆర్ ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పరీక్షల సమయంలో అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద శానిటేషన్ పనులను చేయించాలన్నారు. ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా పరీక్షలకు ఒక గంట ముందుగానే వెళ్లే విధంగా వివిధ గ్రామాల నుంచి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు భద్రత, మౌలిక వసతులు కల్పించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని డీఆర్‌ఓ సూచించారు.

జూన్ 1 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ లవన్న తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. మూడు కేంద్రాల్లో టెన్త్, నాలుగు కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌ఐఓ శ్రీనివాసులు, డీఈఓ రామారావు, డీపీఓ సుస్మిత, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ డీఈఓలు లక్ష్మీప్రసన్న, రఘురామయ్య, ప్రసాద్ రావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 1వ తేదీ వరకు జరగనున్నట్లు చెప్పారు. ప్రథమ సంవత్సర పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

514 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 314 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 550 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 514 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 36 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.314, కనిష్ట ధర రూ.205 పలకగా, సగటున కిలో పొగాకుకు రూ. 262.05 లభించిందన్నారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్

- అప్పటి వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలి
- త్వరలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఎన్నికల తర్వాత రాజకీయ ఘర్షణలు, అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక తిక్కన ప్రాంగణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి, కౌంటింగ్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు రాబోయే 13 రోజులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల తర్వాత క్షేత్రస్థాయిలో ఘర్షణలు జరగకుండా ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి కింది స్థాయి సిబ్బందితో సమాచారం తెప్పించుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయ ఘర్షణలపై ఎన్నికల సంఘం సీరియస్‌గా ఉందన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పోలీసు అధికారులు సంయుక్తంగా వెళ్లి గ్రామాల్లో పర్యటించాలన్నారు. జిల్లాలో ఎన్నికలపై ఫిర్యాదులు వస్తున్నాయని ప్రతి ఫిర్యాదును పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఒక స్టాటిక్ సర్వైలెన్స్, అన్ని ఎఫ్‌ఎస్‌టీ టీంలు కొనసాగిస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రవర్తన నియమావళిని తొలగించే వరకు కూడా అధికారులందరూ గమనిస్తూ ఉండాలన్నారు. జిల్లా, మండలాలకు నియమించిన నోడల్ అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పరిశీలించాలన్నారు. కౌంటింగ్ నిర్వహించడానికి అవసరమైన సిబ్బందిని కేటాయించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్‌కు నియమించిన సిబ్బందికి త్వరలో శిక్షణ ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, కోవూరు, నెల్లూరు సిటీ, కందుకూరు, కావలి, ఆత్మకూరు, సర్వేపల్లి, ఉదయగిరి రిటర్నింగ్ అధికారులు సేతుమాధవన్, వికాస్, జి విద్యాధరి, శీనానాయక్, కె మధులత, బి చిన్నఓబులేసు, ప్రేమ్‌కుమార్, నోడల్ అధికారులు టీ బాపిరెడ్డి, ఎస్ రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

పన్నుల వసూళ్లపై ఎలక్షన్ ఎఫెక్ట్

స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే రాబడి ఎంతో కీలకం. నగరాభివృద్ధికి ఈ నిధులు సమకూర్చుకోవడం తప్పనిసరి. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా.. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవడం కీలకమనే చెప్పాలి. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే వివిధ అభివృద్ధి చేయడం సాధ్యమవుతుంది.

- నూరు శాతం వసూలయ్యేనా?
- ఓ వైపు ఎన్నికల విధుల నిర్వహణ
- మరో వైపు పన్నుల వసూళ్లు చేపట్టిన రెవెన్యూ విభాగం
- 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో తగ్గుదల
- మొండి బకాయిలు రాబడితే నగరం మరింత అభివృద్ధి



నెల్లూరు నగరం

నెల్లూరు(బారకాసు): పన్నుల వసూళ్లపై సార్వత్రిక ఎన్నికల ఎఫెక్ట్ పడింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఎలక్షన్ల హడావుడి నేపథ్యంలో వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవనే చెప్పాలి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,33,116 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వాటి ద్వారా ఆస్తి పన్ను రూపంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.68.31 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో రూ.66.40 కోట్లు వసూలైంది. మిగిలిన మొత్తం బకాయిగా మిగిలిపోయింది. ఈ ఒక్క ఏడాదికి మాత్రమే ఇలా ఉండగా కొన్ని సంవత్సరాలుగా చెల్లించాల్సిన మొండి బకాయిలు రూ.89.31 కోట్ల వరకు ఉంది. ఇందులో ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన భవనాల నుంచి రావాల్సిన మొత్తం రూ.5.44 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కార్యాలయ భవనాలకు సంబంధించి రూ.28.74 కోట్లు రావాలి. అదేవిధంగా ఖాళీ స్థలాలకు సంబంధించి 6,567 అసెస్‌మెంట్లు అధికారిక లెక్కల ప్రకారం ఉండగా.. వాటి ద్వారా పన్నుల రూపంలో ఈ ఏడాదికి రావాల్సిన మొత్తం రూ.17.76 కోట్లు. కానీ వసూలైంది రూ.2.96 కోట్లు మాత్రమే. అలాగే తాగునీటి పన్నులకు సంబంధించి 45,420 అసెస్‌మెంట్లున్నాయి. బకాయిలతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో కలిపి మొత్తం రూ.54.90 కోట్లు బకాయి ఉండగా ఇందులో ఇప్పటి వరకు రూ.10.49 కోట్లు వరకు వచ్చింది. అయితే ఇంకా వసూలు చేయాల్సింది రూ.44.40 కోట్ల వరకు ఉంది.

మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ ద్వారా పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో వసూలు జరిగింది. 2023 – 24తోపాటు గడిచిన సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో మాత్రం యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి, నీటి పన్నులతోపాటు ఖాళీ స్థలాల నుంచి వసూలు కావాల్సిన మొత్తం రూ.కోట్లలో ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిలు రాబడితే నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. కాగా యంత్రాంగం కొద్దిరోజులుగా ఎన్నికల విధుల్లో ఉంది. అయినా రెవెన్యూ విభాగం పన్నుల వసూళ్లకు ప్రయత్నిస్తోందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

బాధ్యతగా పన్నులు చెల్లించాలి



2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భవనాలు, ఖాళీ స్థలాలు, నీటి కుళాయి పన్నులు సకాలంలో చెల్లించాలని కోరాం. ప్రజలకు అవగాహన కల్పించాం. కొంతమంది యజమానులకు నోటీసులు కూడా జారీ చేశాం. పలువురు పన్నులు చెల్లించేందుకు నిరాసక్తత చూపించారు. ప్రజలంతా సహకరించి పన్నులు చెల్లిస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుంది. కాబట్టి పన్నులు చెల్లించే విషయంలో ఆయా యజమానులు తమ వంతు బాధ్యత వహించాలి.

– వికాస్ మర్మత్, కమిషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ

బంగారు గరుడ వాహనంపై నృసింహుడు



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నరసింహ కొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం మోహినీ ఉత్సవం జరిగింది. మూలవర్లకు పూలంగి సేవ కార్యక్రమాలు జరిగాయి. ప్రధానార్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేయగా బంగారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కాకాణి నరహరిరెడ్డి వ్యవహరించారు. శ్రీరంగనాథ భక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతన గొడుగులు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాల జోలికి పోవద్దు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

బిట్రగుంట: 'ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలి. పార్టీలపై అభిమానంతో వివాదాల జోలికి పోవద్దు' అని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని మత్స్యకార గ్రామాల కాపులు, పెద్దలు, స్థానికులతో ఎస్పీ మంగళవారం జువ్వలదిన్నెలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన మత్స్యకారులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ కూడా ఇదే విధంగా పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు. లెక్కింపు పూర్తయ్యే వరకూ, ఆ తర్వాత మరో రెండు వారాలపాటు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సమస్యాత్మక గ్రామాలపై పోలీస్ నిఘా కొనసాగుతుందన్నారు. గొడవల్లో ఇరుక్కుంటే పోలీసు కేసులతో పాటు భవిష్యత్‌లోనూ ఇబ్బందులు తప్పవని వివరించారు. ఒక్కసారి కేసు నమోదైతే ఆ తర్వాత కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందన్నారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్, ఉద్యోగాల సమయంలో కూడా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. గొడవలు జరిగితే గ్రామాల్లో పోలీస్ పికెట్, తనిఖీలు, విచారణలు ఉంటాయన్నారు. ప్రజలు పరిస్థితిని అర్థం చేసుకుని వివాదాల జోలికి పోవద్దని సూచించారు. కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ మత్స్యకారుల చేత గొడవలకు వెళ్లబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, కావలి రూరల్ సీఐ నాగభూషణం, బిట్రగుంట స్టేషన్ సిబ్బంది, పలు మత్స్యకార గ్రామాల కాపులు తదితరులు పాల్గొన్నారు.

600 మొబైల్‌ఫోన్ల రికవరీ



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): మొబైల్ హంట్ విధానంతో సత్ఫలితాలొస్తున్నాయని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అన్నారు. వివిధ రకాలుగా పోగొట్టుకున్న రూ.1.50 కోట్ల విలువచేసే 600 ఫోన్లను పోలీసు అధికారులు రికవరీ చేశారు. మంగళవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ చేతుల మీదుగా ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొబైల్ హంట్‌తోపాటు సీఈఐఆర్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఎవరైనా తప్పుడు పద్ధతిలో వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోగొట్టుకున్న తమ మొబైల్‌ఫోన్లను గుర్తించి అప్పగించిన ఎస్పీ, సైబర్‌క్రైమ్ పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, సైబర్‌క్రైమ్ ఎస్‌ఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో ఈసీ నిబంధనలు మేరకు సిబ్బందికి సదుపాయాలు కల్పించకపోవడంపై ముగ్గురు రెవెన్యూ అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ, ఆర్వో కె.మధులత, తహసీల్దార్ శివనాగిరెడ్డి, ఆర్‌ఐ పృథ్వీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికల సామగ్రి పంపిణీ రోజున భోజనం సక్రమంగా పెట్టలేదని, తాగునీరు అందించలేదని సిబ్బంది నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న కలెక్టర్ స్వయంగా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సదుపాయాల కల్పన విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్ధారించుకున్నారు. దీంతో ఆ ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

నమో నారసింహా

- అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు
- హంస వాహనంపై ఊరేగిన దేవదేవుడు



సరస్వతి అలంకరణలో హంస వాహనంపై ఆశీనుడైన శ్రీవారు



పెంచలకోనలో సాంస్కృతిక ప్రదర్శన

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారు హంస వాహనంపై సరస్వతి అలంకరణలో ఆశీనులై భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, వేద మంత్రాలు, వేద పారాయణం నడుమ శ్రీవారు కోన మాడ వీధుల్లో విహరిస్తూ పారువేట మండపం వరకు క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్రేన్ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పండ్ల రసాలు, చందనం, పసుపు, నారికేళంతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.
- లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని యాగశాలలో లక్ష్మీనరసింహ హోమాన్ని నిర్వహించినట్లు టీటీడీ పండితులు రామానుజాచార్యుల స్వామి తెలిపారు. స్వామివారికి నిత్యం ఉదయం, సాయంత్రం యాగశాలలో హోమాలు నిర్వహించడం దేవస్థాన ఆచారమన్నారు.
- రాత్రి పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులను తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో 1008 సహస్రదీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్‌సేవ నిర్వహించారు.
- రాత్రి బంగారు హనుమంతసేవ అత్యంత వైభవంగా సాగింది. స్వామివారు మహావిష్ణువు ఆరవ అవతారమైన శ్రీరామచంద్రుని రూపంలో స్వర్ణ హనుమంతుడిపై కొలువుదీరి తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి పూలంగి సేవ, ఉదయం 8 గంటలకు సింహ వాహన సేవ, రాత్రి 11 గంటలకు బంగారు గరుడ వాహనసేవ నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో డీసీ విజయసాగర్‌బాబు, చెంగాళమ్మ దేవస్థానం ఏసీ వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి పాల్గొన్నారు.



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

కండలేరులో 6.717 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.717 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలింత మృతిపై ఆందోళన



వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఉలవపాడు: స్థానిక సీహెచ్‌సీ వైద్యశాల పరిధిలో సిజేరియన్ అనంతరం ఓ బాలింత మృతిచెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మండల కేంద్రమైన ఉలవపాడులో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చాగల్లు ఇందిరా నగర్ కాలనీకి చెందిన చవుటూరి మరియమ్మ (21) ప్రసవం కోసం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు ఈనెల 15వ తేదీన వచ్చింది. 16న గైనకాలజిస్ట్ సుస్మిత సిజేరియన్ చేయడంతో మరియమ్మ మగబిడ్డను ప్రసవించింది. కానీ బాలింతకు 18వ తేదీన ఇబ్బందిగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి అదే రోజు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న బంధువులు సదరు గైనకాలజిస్ట్ ఉలవపాడులో సొంతగా నడుపుతున్న సరయు వైద్యశాల వద్దకు వచ్చి ఆందోళన చేశారు. ఆపరేషన్ సక్రమంగా చేయని కారణంగా ఇలా జరిగిందని, ప్రభుత్వ వైద్యురాలై ఉండి ప్రైవేటు వైద్యశాల నడుపుతూ పేదల ప్రాణాలు కాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బాధితురాలి బంధువులతో వైద్యశాల సిబ్బంది రాజీ యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.75
సన్నవి : రూ.35
పండ్లు : రూ.25

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 172
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 300
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 330
లేయర్ చికెన్	: 204